E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 07-01-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక: 07|| పేజీలు–6 www.ekaburu.com




రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ » 4లో

కొత్త సీజన్‌లో కోటి ఆశలతో... » 6లో




తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు » 4లో



'టాక్సిక్'లో మరో హీరోయిన్.. ఫస్ట్ లుక్ రిలీజ్ » 5లో



కేంద్ర మాజీ మంత్రి కల్మాడీ కన్నుమూత » 3లో



# ఏ విచారణకైనా రెడీ

- పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై విచారణకు సర్కారు సిద్ధం
- 2014 నుంచి హిల్‌ట్‌పీ వరకు.. ప్రతిపక్షాలు లేఖ రాస్తే చాలు
- ఆ మరుక్షణమే ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది.. పారిశ్రామిక భూములను తమకు కావాల్సిన వాళ్లకు అప్పగించింది
- మేము తెచ్చిన హిల్ట్ పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు
- పారిశ్రామికవాడల నుంచి కాలుష్య పరిశ్రమలను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలిస్తాం
- కాలుష్య రహిత నగరాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం
- శాసనసభ నిరవధిక వాయిదా

తరువాయి 2లో



హైదరాబాద్‌లో వాయు కాలుష్యం ప్రమాదకరంగా మారింది. నిర్దేశిత ప్రమాణాలను మించిపోయింది. ఇటీవల ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 263 నమోదైంది. వాహనాలతో 27% వాయుకాలుష్యం ఏర్పడుతుంటే, పరిశ్రమలతో 51% ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి 2012 నుంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మేం ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాం. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తాం. వాటికి ప్రత్యామ్నాయ పారిశ్రామికవాడలను సిద్ధంగా ఉంచాం..
– డిప్యూటీ సీఎం భట్టి

ఈకబురు, హైదరాబాద్: 2014 నుంచి, ఇటీవల తమ ప్రభుత్వం తెచ్చిన హిల్‌ట్‌పీ తో పాటు ఇప్పటివరకు జరిగిన పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై ఏ విచారణను ఆదేశించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉంటే.. ఆ మేరకు లేఖ రాసిన మరుక్షణం ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం శాసనసభలో హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పిడి (హిల్ట్) విధానం (పీ), తెలంగాణ రైజింగ్-2047పై లఘు చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు భట్టి జవాబిచ్చారు.

# సోనియాగాంధీకి అస్వస్థత

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు.



తరువాయి 2లో

## తెలంగాణ అస్తిత్వాన్ని
# కాపాడే పార్టీ కావాలి



- సామాజిక తెలంగాణకై కలిసి నడుద్దాం
- జాగృతి విస్తృత స్థాయి సమావేశంలో కవిత
- రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు
- ఎమ్మెల్సీ కవిత రాజీనామాకు ఆమోదం

ఈకబురు, హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు. పార్టీ ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు కమిటీల ఏర్పాటు, ప్రజాసమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె మంగళవారం బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం కోసం పనిచేసే పార్టీ అవసరం ఉందని, సామాజిక తెలంగాణ సాధన కోసం కలిసి నడుద్దామని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నిరంతరం తన పోరాటం ఉంటుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే తనకు అందరూ మద్దతివ్వాలని ఆమె కోరారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు 12 ఏళ్లలో ఏ మేరకు సాకారమయ్యాయి? ఇంకా ఏమేం చేయాలి? అనేది నిర్ధారించడానికి వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజలకు ఎలాంటి సేవలందించాలి? తెలంగాణ ఆవిర్భవించాక ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయి? అసలు ప్రజలు ఏం కోరుకుంటున్నారు? అనే విషయాలను తెలుసుకోవాలని భావిస్తున్నారు.

తరువాయి 2లో



# దావోస్ ఒప్పందాల్లో 60 శాతం కార్యరూపం

- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అసాధ్యం కాదు...
- మంత్రి శ్రీధర్‌బాబు

ఈ-కబురు, హైదరాబాద్: దావోస్‌లో చేసుకున్న ఒప్పందాల్లో 60 శాతం కార్యరూపం దాల్చిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అందుకే మొదటిసారే రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రూ.2.71 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదిరాయన్నారు.

తరువాయి 2లో

## మోదీ, షాలకు
# సమాధులు తవ్వుతాం!

3లో

జేఎన్‌యూలో కొందరు విద్యార్థుల నినాదాలు





# నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు!

- కానీ, రష్యా నుంచి చమురు కొనుగోలును ఇలాగే కొనసాగిస్తే భారత్‌పై టారిఫ్‌లు పెంచేస్తా
- అమెరికా భద్రత కోసం మాకు గ్రీన్‌లాండ్ కావాలి: ట్రంప్

2లో

# అబద్ధపు హామీలతో మోసం

- కేసీఆర్ స్థాయికి రేవంత్‌రెడ్డి సరిపోడు
- రాహుల్ లీడర్ కాదు.. స్క్రిప్టు చదివే రీడర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
ఈకబురు, జనగామ: 'వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతుబంధును రూ.15 వేలకు పెంచుతానన్నారు. కౌలుదారులకు కూడా ఇస్తానన్నారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తానన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఇవన్నీ అబద్ధాలు. అలాంటి హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాంధీనే నడిబజారులో ఉరితీయాలి..' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారక రామారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ లీడర్ కాదని, దేశంలో ఏకైక స్క్రిప్టు చదివే రీడర్ అని విమర్శించారు. స్క్రిప్టులో ఏమున్నా చదివేసే అవగాహన లేని నేత అంటూ ఎద్దేవా చేశారు.

తరువాయి 2లో

## డివిజన్ల పునర్విభజనతో
# సిట్టింగ్ కార్పొరేటర్లకు కొత్త తలనొప్పులు

- పోటీ చేసే డివిజన్ ఎంచుకునేందుకు ఆపసోపాలు
- సిట్టింగ్ ల నిర్ణయం కోసం ఇతర ఆశావహుల ఎదురుచూపులు
- ప్రజా వ్యతిరేకతను చూసి ఖంగుతింటున్న 'ప్రధాన' కార్పొరేటర్

ఈ- కబురు, శేరిలింగంపల్లి గ్రేటర్ హైదరాబాద్ డివిజన్ల పునర్విభజనతో ప్రస్తుత సిట్టింగ్ కార్పొరేటర్లకు కొత్త తలనొప్పులు ప్రారంభమయ్యాయి. తాము ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లు చీలిపోవడంతో కొత్తగా ఏ డివిజన్ ను ఎంచుకొని పోటీచేయాలనే అయోమయంలో సిట్టింగ్ కార్పొరేటర్లు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి పరిధిలోని సిట్టింగ్ కార్పొరేటర్ల పరిస్థితి మరింత సంకటంగా మారింది. ఒక్కో డివిజన్ రెండు నుంచి మూడు కొత్త డివిజన్లుగా విడిపోవడంతో మరోసారి ఏ డివిజన్ నుంచి పోటీ చేయాలనే విషయమై ఆపసోపాలు పడుతున్నారు. ఈమేరకు తమ అనుచరులు, పార్టీ శ్రేణులతో సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సిట్టింగ్ కార్పొరేటర్ నిర్ణయం కోసం అన్ని పార్టీల్లోని ఇతర ముఖ్య నాయకులు సైతం ఎదురు చూస్తున్నారు. సిట్టింగ్ కార్పొరేటర్ ఏదైనా డివిజన్ ఎంపిక చేసుకుంటే మిగిలిన వాటిలో తమకు ఉన్న అవకాశాల మీద బేరీజులు వేసుకుంటున్నారు. కాగా శేరిలింగంపల్లిలోని ఓ 'ప్రధాన' కార్పొరేటర్ కు మాత్రం ప్రజా వ్యతిరేకత కంటి మీద కునుకు లేకుండా చేస్తుందని ప్రచారం జరుగుతోంది. ముక్కలైన తన సిట్టింగ్ డివిజన్ లో అన్ని ప్రాంతాల్లో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారనే సమాచారంతో డివిజన్ ఎంపికలో ఎటూ తేల్చుకోలేక పోతున్నాడని చర్చ సాగుతోంది.




తరువాయి 3లో

ఈ-కబురు

07-01-2026
బుధవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# ఏ విచారణకైనా రెడీ

హిల్ట్ పీతో రూ.10,776 కోట్ల ఆదాయం: 'ప్రతిపక్షం కడుపులో విషం పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధిని పట్టించుకోకుండా తమ రాజకీయం కోసం రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. తమకు కావాల్సిన వాళ్లకు పారిశ్రామిక భూములను వినియోగ మార్పిడి చేసింది. సిరీస్, గల్ఫ్ ఆయిల్ పరిశ్రమలకు భూ వినియోగ మార్పిడి చేసిన అంశాన్ని హిల్ట్ పాలసీతో పోల్చినప్పుడు రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.4,076 కోట్ల నష్టం వాటిల్లింది. హిల్ట్ పీ కింద కాంగ్రెస్ ప్రభుత్వం.. 80 అడుగుల లోపు రహదారి ఉన్న భూములకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్వో) ధరలో 30 శాతం, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పుతో రహదారి ఉన్నచోట ఎస్ఆర్వో ధరలో 50 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. కేవలం భూ వినియోగ మార్పిడి చేస్తున్నందుకు ఈ ఫీజులు వసూలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న భూ వినియోగ మార్పిడి ధరల ప్రకారం అయితే కేవలం రూ.574 కోట్ల ఆదాయం మాత్రమే రాష్ట్రానికి లభిస్తుంది. అదే హిల్ట్ పీ కింద దాదాపు 4,780 ఎకరాల భూములకు భూ వినియోగ మార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా దాదాపు రూ.10,776 కోట్ల ఆదాయం లభిస్తుంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

హిల్ట్ పీ అత్యుత్తమం, పారదర్శకమైనది..

'హిల్ట్ పాలసీ రాగానే ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ఓ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రంలోని భూములన్నింటినీ అమ్మేస్తూ రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించి, బట్ట కాల్చి మీద వేసి తుడుచుకోమంటున్నారు. వారు రాష్ట్ర ప్రజా ప్రయోజనాల కంటే.. సొంత ప్రయోజనాల కోసం ఎక్కువగా పాకులాడుతున్నారు. హిల్ట్ పీ వల్ల రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంటే.. గతంలో వారు చేసిన నిర్ణయాలతో భారీ నష్టం జరిగింది. గత ప్రభుత్వం అనుసరించి విధానాలతో పోలిస్తే హిల్ట్ పీ అత్యుత్తమమైనది. పారదర్శకమైనది. ఆదాయం సమకూరుతుంది.

వారు ఆజామాబాద్, బాలానగర్, హాఫీజ్‌పేట పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వ భూములు లీజులో ఉంటే...వాటిని వేలానికి పెట్టకుండా ఇష్టానుసారం ఇచ్చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పారిశ్రామికవేత్తలకు అప్పగించారు. వనరుల సమీకరణకు 2019లో అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీకి సంబంధం లేకుండా కేటీఆర్ పరిశ్రమల మంత్రిగా జీవో ఇచ్చి పారిశ్రామిక భూములను ఐటీ పరిశ్రమలకు మార్చేలా ఉత్తర్వులు ఇచ్చారు. వారికి అనుకూలమైన వారికి భూ మార్పిడి చేశారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. మేము తెచ్చిన పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు..' అని భట్టి చెప్పారు.

రాష్ట్రానికి ఉత్పాదక షాక్ అవసరం

'ప్రస్తుతం రాష్ట్రం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. వృద్ధి ఇలానే కొనసాగితే 2047 నాటికి 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగానే ఎదుగుతాం. ఇది సరిపోదని..3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్-2047 తీసుకొచ్చాం. కేవలం ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం ద్వారా ఈ లక్ష్యానికి చేరుకోలేం. మనకు ఒక 'ఉత్పాదకత షాక్' అవసరం. పెట్టుబడి రేటును జీఎస్డీపీలో 52 శాతానికి పెంచాలనే కఠిన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం..' అని భట్టి తెలిపారు.

తర్వలో హిల్ట్ పీ మార్గదర్శకాలు: శ్రీధర్‌బాబు

పదేళ్ల పాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో చాలాచోట్ల అడ్డగోలు భూకేటాయింపులు జరిపిన విషయం వాస్తవమని.. తొలుత మాట్లాడిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పరిశ్రమల పేరిట జరిగిన ఈ భూకేటాయింపులపై తప్పకుండా విచారణ చేపడతామని చెప్పారు. 'హిల్ట్ పాలసీ ఏకపక్ష నిర్ణయం కాదు. నిపుణులు, మేధావులతో చర్చించిన తర్వాతే రూపొందించాం. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు త్వరలో విడుదలవుతాయి. మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులను పబ్లిక్ డొమైన్ (అందరికీ అందుబాటు)లో పెట్టం. అవి కేవలం ఇన్ కెమెరా (అంతర్గత) సూచనలు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను పాజిటివ్‌గా చూడాలి. అప్పుడే నిర్ణయాల అమలు వేగవంతంగా, విజయవంతంగా పూర్తవుతుంది. పరిశ్రమల తరలింపుతో కార్మికులకు ఉపాధి ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన అవసరం లేదు. కార్మిక చట్టాలు తప్పకుండా అమల్లో ఉంటాయి..' అని శ్రీధర్‌బాబు చెప్పారు.

పూర్తి పారదర్శక పాలసీ: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పారిశ్రామిక భూమి బదలాయింపు విధానం రాష్ట్ర సుస్థిర పురోగతితో పాటు పారిశ్రామిక కాలుష్య రహిత హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు దోహదం చేస్తుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పూర్తి పారదర్శకంగా ఉండేలా గొప్ప పాలసీకి రూపకల్పన చేశామని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అర్థరహిత విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. లీజు హక్కులతో ఉన్న పారిశ్రామిక భూములకు ఈ కొత్త విధానం వర్తించదని, పూర్తిస్థాయి యాజమాన్య హక్కులతో భూములు కలిగిఉన్న పారిశ్రామిక భూములకే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ఆ జీవోలో చీకటి కోణాలు: ఏలేటి

'కాలుష్య కారక పరిశ్రమలను నగరం బయటకు పంపడం సరైన నిర్ణయమే. కానీ ఎలాంటి పర్యావరణ అధ్యయనాలు, కమిటీల నివేదికలు లేకుండా బయటకు తరలే పరిశ్రమలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించకుండా హడావుడిగా హిల్ట్ పాలసీని తేవడంలో ఆంతర్యం ఏమిటి? ప్రభుత్వం జారీ చేసిన జీఓ 27లో అనేక చీకటి కోణాలు ఉన్నాయి. 22 పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఎక్కడికి తరలిస్తారు? అత్యంత కాలుష్య కారక పరిశ్రమలున్న ఐడీఏ బొల్లారంను హిల్ట్ పాలసీలో చేర్చకపోవడం విడ్డూరం..' అని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పరిశ్రమల భూములతో రియల్ ఎస్టేట్ దందా చేయడాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పచ్చదనం పెంచాలి..' అని సూచించారు. రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన హిల్ట్ పాలసీని అందరూ స్వాగతించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వాయు నాణ్యత వేగంగా క్షీణిస్తోందని, ఇదే తరహాలో కాలుష్యం పెరిగితే పదేళ్లలో ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తుతాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు: పాల్వాయి హరీశ్‌బాబు

'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్-2047 విడుదల చేశారు. ఇప్పుడు అక్కడ టెంట్లు కూడా లేవు. ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు..' అని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని మరో బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ అన్నారు.

హిల్ట్ పాలసీకి చట్టబద్ధత లేదు: అక్బరుద్దీన్

'వనరుల సమీకరణకు ఈ ప్రభుత్వం భూముల వెనుక పరిగెడుతోంది. ప్రభుత్వం విడుదల చేసిన హిల్ట్ పాలసీ జీఓకు ఎలాంటి చట్టబద్ధత లేదు. పాలసీ రూపకల్పనలో పారదర్శకత కనిపించడం లేదు. పాలసీలో పేర్కొన్న భూములు ప్రైవేటువా లేక ప్రభుత్వ భూములా అనే అంశంపై ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలి..' అని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుదీన్ ఒవైసీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 50 ఎకరాలను వెనక్కి తీసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. నగర కాలుష్యాన్ని నివారించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీకి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చెప్పారు. కాగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడిన తర్వాత శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది.



# సోనియాగాంధీకి అస్వస్థత



మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ కాలుష్య ప్రభావమే కారణమన్న వైద్యులు!

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 79ఏళ్ల సోనియాకు దీర్ఘకాలిక దగ్గు సమస్య ఉండడంతో పాటు ఢిల్లీలో ఉన్న వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పుడు చలి తీవ్రత కూడా తోడవడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఒక్కసారిగా తిరగబెట్టాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఛాతీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆందోళన అవసరంలేదని ఆస్పత్రి చైర్మన్ చెప్పారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ కావాలి

మొదటి పేజీ తరువాయి



జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. స్టీరింగ్ కమిటీలో సీనియర్ జర్నలిస్టులు సయ్యద్ ఇస్మాయిల్, లోక రవిచంద్ర, జాగృతి సీనియర్ నాయకురాలు మంచాల వరలక్ష్మి సభ్యులుగా ఉన్నారు. ఆయా కమిటీలు తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై అధ్యయనం చేసి 17న స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. జాగృతి స్టీరింగ్ కమిటీ ఆయా నివేదికలను అధ్యయనం చేసి కవితకు సమర్పించనుంది. ఆ తర్వాత జాగృతి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి, కీలక నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. అదేవిధంగా జాగృతి జనంబాటలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపైనా చర్చించారు. ఈ సమావేశంలో జాగృతి 23 అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు,ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఉద్యమకారులు, జాగృతి కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, కార్మికులు, వివిధ ప్రజా, కులసంఘాల ప్రతినిధులు కవితను కలిసి, ఆమె ఏర్పాటు చేసే పార్టీకి మద్దతు ఇస్తామని ప్రకటించారు.

కవిత రాజీనామాకు ఆమోదం

ఎమ్మెల్సీ పదవికి కవిత చేసిన రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం ఆమోదించారు. ఆమె రాజీనామా ఆమోదంపై లెజిస్లేటివ్ సెక్రటరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆస్థానం ఖాళీ అయినట్టు ప్రకటించారు. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కవిత ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన రోజే ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. చైర్మన్ అనుమతితో తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులు, ఇతర అంశాలను ఆమె మండలిలో సోమవారం వివరించారు. ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశానని, దాన్ని ఆమోదించాలని కవిత కోరారు. కవిత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఆమె రాజీనామాను ఆమోదించాలని నిర్ణయం తీసుకున్నారు.

# అబద్ధపు హామీలతో మోసం

మొదటి పేజీ తరువాయి

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా? ఊడుతుందా? తెలియని పరిస్థితి ఉందన్నారు. సీఎంకు కూడా మూటలు మోసిన అనుభవం తప్ప మరేమీ లేదని, ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లాలో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచుల అభినందన సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.**

### రేవంత్‌కు పిచ్చి ముదిరి పాకానపడింది

'రాష్ట్రంలో చెక్‌డ్యాంలు పటాకులు పేలినట్లు పేలుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అట్లనే ఉంది. రాష్ట్రంలో పాలిచ్చే బర్రెను కాదనుకుని, వెనకనుంచి తన్నే గేదెను తెచ్చుకున్నామని ప్రజలు మథనపడుతున్నారు. గోదావరి ఎక్కడుందో కూడా రేవంత్‌కు తెలియదు. భాక్రానంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెబుతున్న రేవంత్‌రెడ్డి..రాష్ట్రాన్ని ఎలా నడిపిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతోంది.. ప్రజలకు చేసిన వాగ్దానాలు ఎంతవరకూ నెరవేర్చారో ఒక్కసారి ఆలోచించాలి. ఎనకటి రోజులు తెస్తానన్న రేవంత్, రాబందు కాలం తీసుకువచ్చారు. తెలంగాణను అభివృద్ధి చేసిన నాయకుడిని (కేసీఆర్)ఉరి తీయాలంటారా?. ఇంటింటికీ నీళ్లు ఇచ్చి, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌ను ఉరి వేయాలని రేవంత్‌రెడ్డి అనడం చూస్తుంటే ఆయనకు పిచ్చి ముదిరి పాకాన పడిందని అర్థమవుతోంది. ఆ మాటకొస్తే హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాం□దీనే ఉరి తీయాలి. తన సొంత సెక్యూరిటీని కూడా ప్రజల ముందే కొట్టే ముఖ్యమంత్రి ఎక్కడా దొరకడు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ చెప్పు దూళికీ రేవంత్ సరిపోడు. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కే ఆయన ఆగమాగం అవుతున్నాడు. ఇక అసెంబ్లీలో మాట్లాడితే అక్కడే గుండె ఆగిపోయి సచ్చిపోతారు..'అని కేటీఆర్ విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు!

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను సంతోషంగా లేననే విషయం భారత ప్రధాని మోదీకి తెలుసునన్నారు. తనను సంతోషపరిచేందుకు భారత్ ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. మోదీ మంచి వ్యక్తి అని, కానీ.. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ ఇలాగే కొనసాగిస్తే మాత్రం భారత్‌పై త్వరలోనే టారిఫ్‌లు పెంచేస్తానని హెచ్చరించారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు భారత్‌పై టారిఫ్‌లు తగ్గించాలంటూ అమెరికాలో భారత రాయబారి వినయ్‌మోహన్ క్వాత్రా తమను కోరారని అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం తెలిపారు. గత నెలలో తాను వినయ్‌మోహన్‌ను ఆయన నివాసంలో కలిసిన సందర్భంలో ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చారని, 25 శాతం టారిఫ్ నుంచి భారత్‌ను ఉపశమనం కలిగించాల్సిందిగా కోరారని చెప్పారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ తగ్గించుకునేలా చేసేందుకే ట్రంప్ ఈ టారిఫ్ విధించారని గ్రాహం అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యవహారశైలిని ప్రతిపక్ష కాంగ్రెస్ తప్పుబట్టింది. అమెరికా సెనేటర్ చేసిన వ్యాఖ్యలు.. ట్రంప్ వద్ద మోదీ మోకరిల్లుతున్న తీరును స్పష్టం చేస్తున్నాయని 'ఎక్స్'లో కాంగ్రెస్ పేర్కొంది. ట్రంప్ కోసం చిరకాల మిత్ర దేశమైన రష్యా నుంచి చమురు కొనుగోలును కూడా మోదీ నిలిపివేశారని ఆరోపించింది. మోదీ తన వ్యక్తిగత పరపతి పెంచుకునేందుకు, ట్రంప్‌ను సంతోషపరిచేందుకు దేశానికి ఎందుకు హాని చేస్తున్నారని ప్రశ్నించింది. మోదీ స్నేహితుడు భారత్‌కు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. మేలు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ట్రంప్‌పై పొగడ్తలు కురిపిస్తూనే ఉన్నారంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

**బెదిరింపులు మానుకోవాలి: డెన్మార్క్**

అమెరికా భద్రత కోసం తమకు గ్రీన్‌లాండ్ కూడా కావాలని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా వ్యూహాత్మక రక్షణ స్థావరంగా, ఖనిజ సంపద పరంగా తమకు ఆ ప్రాంతం అవసరమని పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను డెన్మార్క్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపులు మానుకోవాలని, గ్రీన్‌లాండ్‌ను నియంత్రించాలన్న అమెరికా కోరిక కలగానే మిగిలిపోతుందని అన్నారు. డానిష్ కింగ్‌డమ్‌లోని మూడు దేశాల్లో దేనిపైనా అమెరికాకు ఎటువంటి హక్కుల్లేవని స్పష్టం చేశారు. ఏ విషయంపైనైనా చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే అవి తగిన వేదికపై, అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ జరగాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసం లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసిందంటూ వచ్చిన వార్తలను ట్రంప్ ఖండించారు. దీనిపై రష్యా చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. అలాంటి లక్ష్యంతో దాడి జరగలేదని తమ అధికారులు ధ్రువీకరించినట్టు చెప్పారు.

ప్రపంచ శాంతికి విఘాతం: జిన్‌పింగ్

ప్రపంచం గడిచిన శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత కుదుపులకు లోనవుతోందని, అనిశ్చితితో ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఏకపక్ష, బెదిరింపు ధోరణి చర్యలు ప్రపంచ శాంతిని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న దేశాల అభివృద్ధి విధానాలను, మార్గాలను పెద్ద, అభివృద్ధి చెందిన దేశాలు గౌరవించాలన్నారు. మదురోను అమెరికా బంధించి తీసుకువెళ్లడంపై జిన్‌పింగ్ ఈ మేరకు స్పందించారు. సోమవారం ఆయన ఐర్లాండ్ ప్రధాని మిచెల్ మార్టిన్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.



# దావోస్ ఒప్పందాల్లో 60 శాతం కార్యరూపం

మొదటి పేజీ తరువాయి

సానుకూల దృక్పథంతో కష్టపడితే 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం అసాధ్యం కాదన్నారు. మంగళవారం శాసనసభ, మండలిలో 'తెలంగాణలో కొత్త పరిశ్రమలు' అనే అంశంపై జరిగిన చర్చ సందర్భంగానూ మంత్రి మాట్లాడారు. "దావోస్ పర్యటనలో నేను కూడా సీఎం రేవంత్‌రెడ్డి వెంట ఉన్నాను. పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తమకు ఎలాంటి హామీ ఇస్తుందని పారిశ్రామికవేత్తలు అడిగారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని మెరుగుపరిచేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వబోం. మా విధానాల వల్లే విప్రో, కాగ్నిజెంట్ వంటి అనేక సంస్థలు తమ సామర్థ్యం పెంచుకున్నాయి. తద్వారా 1.78 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ 13% అభివృద్ధి సాధించి తీరుతాం. 100 జీసీసీల ఏర్పాటు లక్ష్యం: గ్లోబల్ సమిట్‌లో రూ.5.77 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు చేసుకున్నాం. నిరుడు 70 జీసీసీలు ఏర్పాటు కాగా... ఈసారి 100 జీసీసీల ఏర్పాటు లక్ష్యంతో ఉన్నాం. ఐటీ పరిశ్రమలకు డిమాండ్ దృష్ట్యా పీపీపీ విధానంలో త్వరలో అంతర్జాతీయ హంగులతో ఐటీ పార్క్‌లు నిర్మించబోతున్నాం. 2004 నుంచి 2014 వరకు రూ.55 వేల కోట్లున్న ఐటీ ఎగుమతులు... తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో రూ.2 లక్షల కోట్లకు చేరాయి. గత రెండేళ్లలో రూ.2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై ఒత్తిడి తగ్గించేందుకు బండ రావిర్యాల, ప్యారానగర్‌లలో కొత్త యార్డులు ఏర్పాటు చేయబోతున్నాం. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనేందుకు లగచర్ల ఉదంతమే ఉదాహరణ. అయినా చిత్తశుద్ధితో పనిచేస్తూ... పరిశ్రమల ద్వారా రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలను కల్పించాం" అని శ్రీధర్‌బాబు వివరించారు. శాసనసభలో భాజపా సభ్యుడు పాల్వాయి హరీశ్ (సిర్పూరు) మాట్లాడుతూ... తెలంగాణ రైజింగ్‌లో పేర్కొన్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఎలా సాధ్యమో వివరించాలన్నారు. స్థూల రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 13% చొప్పున నికరంగా కొనసాగితే తప్ప ఇది సాధ్యం కాదని, ప్రపంచంలో ఏ దేశం కూడా ఇంత అభివృద్ధి సాధించలేదన్నారు. రూ.వేల కోట్ల ఒప్పందాలు జరిగినా వాస్తవంగా ఎన్ని కార్యరూపం దాల్చాయో చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు.



# ఘనంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## గంగాధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు



గంగాధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు




పార్టీ శ్రేణుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న గంగాధర్ రెడ్డి



పార్టీ శ్రేణుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న గంగాధర్ రెడ్డి



పార్టీ శ్రేణుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు గంగాధర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అంతకుముందు సోమవారం అర్ధరాత్రి డివిజన్ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున గంగాధర్ రెడ్డి నివాసానికి తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గోపనపల్లి లో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ రవి కుమార్ యాదవ్ హాజరై గంగాధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ, టీఎన్‌జీవోస్ కాలనీ, గౌలిదొడ్డి, మంజీరా డైమండ్ హైట్స్, అపర్ణ సైబర్ జోన్, నల్లగండ్ల విలేజ్, గోపనపల్లి, గోపనపల్లి తండా, కేశవ్ నగర్, ఖాజాగూడ, రాయదుర్గం, జీపీఆర్ఏ క్వార్టర్స్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై ప్రజలు చూపిస్తున్న అపారమైన ప్రేమకు, నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలే తనకు శక్తి, ప్రేరణ అని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే కార్పొరేటర్‌గా పనిచేస్తానని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో కార్పొరేటర్‌గా గెలిచి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం తనకు గర్వకారణమని అన్నారు. ఈ వేడుకలలో డివిజన్ ప్రజా ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోదీ, షాలకు సమాధులు తవ్వుతాం!

న్యూఢిల్లీ, జనవరి 6: జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో కొందరు విద్యార్థులు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు వ్యతిరేకంగా అభ్యంతరకర నినాదాలు చేశారు. 2020లో ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేతలు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఓ కార్యక్రమంలో కొందరు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంతో పాటు మోదీ, షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'మోదీ, అమిత్ షాలకు సమాధులు తవ్వుతాం' అంటూ తీవ్ర వివాదాస్పద నినాదాలు చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే, 2020లో వర్సిటీలో జరిగిన హింసకు వ్యతిరేకంగా ఏటా జనవరి 5న నిరసన కార్యక్రమం చేపడతారని జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు అదితి మిశ్రా చెప్పారు. అక్కడ చేసిన నినాదాలు సైద్ధాంతికపరమైనవే తప్ప ఏ ఒక్కరికీ వ్యతిరేకంగా చేసినవి కాదని పేర్కొన్నారు. కాగా, ప్రధాని, హోంమంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన వారిపై కేసు నమోదు చేయాలంటూ వర్సిటీ భద్రతాధికారులు ఢిల్లీ పోలీసులకు లేఖ రాశారు. ఆ నినాదాలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయన్నారు. జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు అదితి మిశ్రా సహా పలువురి పేర్లను లేఖలో ప్రస్తావించారు. వివాదాస్పద నినాదాలు చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదైందని యూనివర్సిటీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. యూనివర్సిటీలు సరికొత్త ఆలోచనలు, నవకల్పనలకు కేంద్రాలుగా ఉండాలి తప్ప విద్వేషాలకు ప్రయోగశాలలుగా మారకూడదని తేల్చిచెప్పింది. బాధ్యులపై తక్షణ సస్పెన్షన్, బహిష్కరణ, శాశ్వతంగా డిబార్ చేయడం వంటి క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిపింది. జేఎన్‌యూలో వివాదాస్పద నినాదాలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఖండించారు. ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నవారికి జేఎన్‌యూను అడ్డాగా మార్చేశారని విపక్షాలపై మండిపడ్డారు.



# డివిజన్ల పునర్విభజనతో సిట్టింగ్ కార్పొరేటర్లకు కొత్త తలనొప్పులు




శేరిలింగంపల్లి మ్యాప్

**7 నుంచి 18కి పెరిగిన డివిజన్లు...**

ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచిన విషయం తెలిసిందే. కాగా డివిజన్ల పునర్విభజనలో శేరిలింగంపల్లి మండల పరిధిలో గతంలో ఉన్న 7 డివిజన్లు ప్రస్తుతం 18కి పెరిగాయి. గతంలో ఉన్న ఒక్కో డివిజన్ రెండు నుంచి మూడు డివిజన్లుగా రూపాంతరం చెందాయి. దీంతో ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ కార్పొరేటర్లు కొత్తగా ఏర్పడిన ఏ డివిజన్ లో పోటీ చేయాలనే విషయంలో తర్జనభర్జనలు పడుతున్నారు. సిట్టింగ్ కార్పొరేటర్లుగా ఉన్న అడ్వాంటేజీ ఓ వైపు బేరీజు వేస్తూ, మరోవైపు సిట్టింగ్ అభ్యర్థిగా ఉన్న వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రస్తుత డివిజన్లలో కేవలం 30 నుంచి 40వేల ఓట్లు ఉండడంతో డివిజన్ ఎంపికలో ఏ చిన్నతప్పు జరిగినా మొదటికే మోసం వస్తుందనే ఆందోళనలో ఉన్నారు. తమకు ఏ డివిజన్ ఆనుకూలంగా ఉంది,.. ఎక్కడ ఎక్కువ పనులు చేపట్టాము,.. గత ఎన్నికల ఓటింగ్ సరళి.. వంటి వివరాల ఆధారంగా తమకు పట్టున్న ప్రాంతాలు ఏవనే విషయమై అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. మరోవైపు సిట్టింగ్ కార్పొరేటర్లు ఏదైనా డివిజన్ ఎంపిక చేసుకుంటే మిగిలిన వాటిలో తమకూ అవకాశం వస్తుందనే ఆశాభావంతో అన్ని పార్టీల్లో ప్రధాన నాయకులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. కొన్ని డివిజన్లలో ఇప్పటికే సిట్టింగ్ కార్పొరేటర్ నిర్ణయాన్ని కాదని, కొంతరు ఆశావహులు తమ ప్రచార కార్యక్రమాలను ఉధృతం చేయడం విశేషం.

**షాక్ లో ఆ 'ప్రధాన' కార్పొరేటర్...**

కాగా శేరిలింగంపల్లిలో సిట్టింగ్ కార్పొరేటర్ల పరిస్థితి ఈ విధంగా ఉండగా, ఓ కార్పొరేటర్ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందనే ప్రచారం సాగుతుంది. గతంలో ఉన్న తన డివిజన్ మూడు ముక్కలు కాగా ప్రస్తుతం ఏర్పడిన అన్ని డివిజన్ల పరిధిలోనూ తనపై వ్యతిరేకత ఉందనే ప్రచారం సదరు కార్పొరేటర్ ను ఆందోళనకు గురి చేస్తుందని తెలుస్తుంది. శేరిలింగంపల్లిలో ముఖ్య నాయకుడికి 'ప్రధాన' అనుచరుడిగా పేరున్న ఆ కార్పొరేటర్ గత ఐదేళ్ల కాలంలో సదరు నాయకుడితో కలిసి మిగిలిన డివిజన్లలో తిరుగుతూ తన డివిజన్ సమస్యలను గాలికి వదిలేశాడనే కోపం డివిజన్ ప్రజల్లో ఉందనే ప్రచారం సాగుతుంది. దీంతో పాటు కార్పొరేటర్ గా ఉండి ఎన్నికల సమయంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తల మీద దాడికి దిగడం, నోటిదురుసు, అవినీతి ఆరోపణల కారణంగా ఈయనకు ప్రజల్లో వ్యతిరేకతను తెచ్చిపెట్టిందని సొంతపార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు. ప్రజా వ్యతిరేకతను గమనించి మూడుగా విడిపోయిన తన డివిజన్ లో ఏ డివిజన్ లో పోటీ చేయాలనే విషయంలో సదరు కార్పొరేటర్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారని సమాచారం. ఇప్పటి వరకు అండగా ఉన్న ముఖ్య నాయకుడు సైతం ఈ కార్పొరేటర్ విషయంలో అంతగా సుముఖంగా లేరని, అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నాడనే చర్చ సాగుతుంది.

మొదటి పేజి తరువాయి

# గచ్చిబౌలిలో ముగ్గురు బైక్ దొంగల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసిపి శ్రీధర్




నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బైక్ లను పరిశీలిస్తున్న ఏసిపి తదితరులు

**రూ.50 లక్షల విలువైన 17 ఖరీదైన బైకులు స్వాధీనం**

ఈకబురు, శేరిలింగంపల్లి : పార్కు చేసి ఉంచిన ఖరీదైన బైకులను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 50లక్షల రూపాయల విలువైన మొత్తం 17 బైకులను స్వాధీనం చేసుకున్నారు.. చోరీ చేసిన బైకులని తెలిసి సైతం వీరి వద్ద వాహనాలు కొనుగోలు చేసిన మరో ఇద్దరి మీద సైతం పోలీసులు కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మంగళవారం ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదాపూర్ ఏసిపి శ్రీధర్ వెల్లడించారు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన సంతోష్ దాస్(19) నగరానికి వచ్చి మియాపూర్ న్యూ కాలనీలో నివాసం ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. ఇతను గతంలో శంషాబాద్, ఆర్జీఐ పోలీస్ స్టేషన్, చిట్యాల తదితర ప్రాంతాల్లో వాహనాల చోరీలకు పాల్పడి అరెస్టయ్యాడు. జైలు నుంచి విడుదలైన తరువాత సైతం తన చోరీలను కొనసాగించాడు. ఇతనికి గుంటూరు నుంచి వచ్చి నిజాంపేటలో నివాసం ఉంటున్న బెజ్జంకి మణికాంత(20), రాజమహేంద్రవరం నుంచి వచ్చి నిజాంపేటలోనే ఉంటున్న లోకేష్ వర్మ(24)లు స్నేహితులయ్యారు. కొన్నిరోజుల తరువాత వీరు సైతం సంతోష్ దాస్ ఉంటున్న ఇంటికి మారిపోయారు. అనంతరం ముగ్గురు కలిసి సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. గతకొంత కాలంగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల లిమిట్స్ లో ఇళ్ల ముందు పార్కు చేసి ఉంచిన ఖరీదైన బైకులను చోరీ చేశారు. గచ్చిబౌలిలో బైకు దొంగతనాలపై ఫిర్యాదులు అందుకున్న పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కొండాపూర్ లో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు చేసిన నేరం అంగీకరించారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 ఖరీదైన బైకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా చోరీ చేసిన బైకులను వీరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న నక్కా హేమంత్, సాయిరాం అనే వ్యక్తుల మీద సైతం పోలీసులు కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బైకుల విలువ దాదాపు 50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించారు. సమావేశంలో గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ బాలరాజు, డిఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్ లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం యువకుడు మృతి



ప్రమాదంలో మృతిచెందిన సూరజ్ సింగ్ (ఫైల్ )

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : ఐటి కారిదార్ లో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబందించిన వివరాలు ఇన్స్ పెక్టర్ బాలరాజు కథసం ప్రకారం..**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బామా జిల్లా అత్తరా గ్రామానికి చెందిన సూరజ్ సింగ్(23) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చాడు. గౌలిదొడ్డిలోని స్టే హోటల్ లో రిసెప్షనిస్టుగా పని చేస్తూ, హోటల్ అవరణలోనే నివాసం ఉంటున్నాడు. కాగా సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో సూరజ్ తన బైక్ (టిఎస్09 ఎస్ఆర్3420) మీద గౌలిదొడ్డి నుంచి విప్రో సర్కిల్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో వర్చుసా మెయిన్ గేటు ముందు సూరజ్ సింగ్ ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు మాద్యలో ఉన్న డివైడర్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరజ్ కిందపడగా, అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని గాయపడిన సూరజ్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూరజ్ ఉదయం 8.30గంటలకు మృతి చెందాడు. దీంతో విషయాన్ని జీడిమెట్లలో ఉంటున్న సూరజ్ సోదరుడికి సమాచారం ఇచ్చిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# కేంద్ర మాజీ మంత్రి కల్మాడీ కన్నుమూత

పుణె: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ (81) మంగళవారం తెల్లవారుజామున పుణెలో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3.30గంటలకు తుదిశ్వాస విడిచారు. 1944లో మద్రాసులో జన్మించిన కల్మాడీ భారత క్రీడా రంగ పరిపాలనలో అత్యంత ప్రాముఖ్యమున్న వ్యక్తిగా ఖ్యాతి గడించారు. కొన్ని క్రీడా రంగ కుంభకోణాల్లో అపఖ్యాతి కూడా మూటగట్టుకున్నారు. రైల్వే శాఖ సహాయ మంత్రిగానే కాక భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షునిగా కూడా పనిచేశారు. భారత వాయుసేన పైలట్‌గా 1971 నాటి భారత్‌పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. తొలిసారిగా 1982లో పార్లమెంటులో ప్రవేశించారు. నాలుగు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా, మూడుసార్లు పుణె నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. పుణెను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల ఎన్సీపీ (ఎస్పీ) నాయకుడు శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

# రూ.14,000 పెరిగిన కిలో వెండి



ఇటీవల కాస్త తగ్గినట్లు కనిపించిన వెండి ధర, మళ్లీ భారీగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో కిలో వెండి ధర రూ.2,59,300కు చేరింది. సోమవారం ధర రూ.2,45,000తో పోలిస్తే రూ.14,000కు పైగా పెరిగింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర 81.20 డాలర్లకు చేరడం వల్లే, దేశీయంగా ధర ఇంతలా పెరిగిందని బులియన్ వర్తకులు చెబుతున్నారు. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1600 పెరిగి రూ.1,41,900కు చేరింది. ఈ ధరల్లో అన్ని పన్నులు కలిసే ఉన్నాయి.

# రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ

**అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ముడి చమురు దిగుమతి చేసుకుంటోందంటూ వచ్చిన వార్తల సెగ మంగళవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు తగిలింది. ముడిచమురు నుంచి ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఆర్ఐఎల్ ఎగుమతి చేస్తుంటుంది. ఆయా దేశాల ఆంక్షలను ఆర్ఐఎల్ ఉల్లంఘించినట్లుగా వచ్చిన వార్తలను సంస్థ ఖండించినా, స్టాక్‌మార్కెట్లో షేరు 4 శాతానికి పైగా నష్టపోయి, సంస్థ మార్కెట్ విలువ ఒకేరోజు రూ.94,000 కోట్లకు పైగా క్షీణించింది.**




ఐరోపా దేశాల ఆంక్షల అనంతరమూ రష్యా నుంచి తాము ముడిచమురును దిగుమతి చేసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఐరోపా కూటమి విధించిన ఆంక్షలకు అనుగుణంగా, గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద ఉన్న తమ రిఫైనరీలో రష్యా ముడిచమురు వాడటాన్ని 2025 నవంబరు 20న ఆపేశామని రిలయన్స్ తెలిపింది. ఇంతకుముందు రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేసే భారతీయ సంస్థగా ఆర్ఐఎల్ ఉంది. జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రెండు రిఫైనరీలున్నాయి. సెజ్ యూనిట్లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను ఐరోపా కూటమి, అమెరికా, ఇతర విపణులకు సంస్థ ఎగుమతి చేస్తోంది. రెండోదైన పాత యూనిట్‌లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను భారతీయ విపణికి ఆర్ఐఎల్ సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరు 1 నుంచి రష్యాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురునే వాడుతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది.

**బీపీసీఎల్ కోసం వచ్చాయా?**

డేటా అనలటిక్స్ సంస్థ కెప్లెర్ నివేదికను ఉటంకిస్తూ.. 2.2 మిలియన్ బ్యారెళ్ల ఉరాల్స్‌తో (రష్యా ముడి చమురులో ఓ రకం) కూడిన మూడు ట్యాంకర్లు సిక్కా ఓడరేవు దిశగా వెళ్లాయని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం తెలిపింది. జామ్‌నగర్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌కు సరఫరా అయ్యే ముడి చమురులో అత్యధికం ఈ ఓడరేవు ద్వారానే వస్తుందని పేర్కొంది. అయితే సిక్కా ఓడరేవును రిలయన్స్‌తో పాటు మిగతా సంస్థలూ వాడుతుంటాయి. ఈ వార్తా కథనంలో చెబుతున్న మూడు ఓడల ద్వారా వచ్చిన ముడి చమురు, భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (బీపీసీఎల్)కు చెందిన బీనా రిఫైనరీ కోసమై ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

**ట్రంప్ హెచ్చరికలే కారణమా?**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్‌పై రెండు రోజుల క్రితం మళ్లీ హెచ్చరికలు చేశారు. రష్యా చమురును కొనడం తనకు సంతోషం కలిగించడం లేదని, భారత్ ఉత్పత్తులపై సుంకం మరింత పెంచుతానని పేర్కొన్నారు. ఈ హెచ్చరికల వల్లే రెండురోజులుగా మన స్టాక్‌మార్కెట్లు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే, రిలయన్స్‌పై బ్లూమ్‌బర్గ్ అందించిన కథనం, మదుపర్లపై ప్రతికూల ప్రభావం చూపిందని భావిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు మంగళవారం బీఎస్ఈలో 4.42% నష్టపోయి రూ.1,507.70 వద్ద ముగిసింది. గత 8 నెలల్లో ఈ షేరుకు ఒక రోజులో వచ్చిన అత్యధిక నష్టం ఇదే. మంగళవారం ఒక దశలో 5.18 శాతం కుదేలై రూ.1,497.05కూ పడింది కూడా. కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.94,388.99 కోట్లు ఆవిరై రూ.20,40,290.90 కోట్లకు పరిమితమైంది.

## అదానీ ₹1000 కోట్ల ఎన్‌సీడీలు ఇష్యూ..

# 45 నిమిషాల్లోనే ఉఫ్!




దిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడో విడత నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (NCD) పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం రూ.1000 కోట్ల విలువైన ఎన్‌సీడీల జారీ ప్రారంభమైన 45 నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తయ్యింది. ప్రాథమిక ఇష్యూ పరిమాణం రూ.500 కోట్లు కాగా.. 10 నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. గ్రీన్ షూ ఆప్షన్‌తో (స్పందన ఆధారంగా) కలిపి మొత్తం వెయ్యి కోట్ల రూపాయల ఎన్‌సీడీల సబ్‌స్క్రిప్షన్ గంటలోపే పూర్తయ్యింది.

నేడు (జనవరి 6న) ప్రారంభమైన ఈ ఇష్యూ జనవరి 19న ముగియనుంది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఈ ఎన్‌సీడీలను నమోదు చేయనున్నారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ విధానం కింద తొలుత దరఖాస్తు చేసుకున్నవారికి ఎన్‌సీడీల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వార్షికంగా ఈ ఎన్‌సీడీలపై 8.9% ప్రతిఫలాన్ని సంస్థ ఆఫర్ చేస్తోంది. ఇక్రా, కేర్ రేటింగ్స్ నుంచి AA (స్టేబుల్ అవుట్‌లుక్) రేటింగ్ పొందింది. ఇదే రేటింగ్ కలిగిన బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే అధిక ప్రతిఫలం ఇస్తుండడంతో రిటైల్ మదుపర్లు కొనుగోళ్లకు పోటీపడ్డారు.

గతేడాది జులైలో కూడా రూ.1000 కోట్ల విలువైన ఇష్యూలను అదానీ ఎంటర్‌ప్రైజెస్ జారీ చేసింది. అప్పట్లో తొలి మూడు గంటల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అవ్వడం గమనార్హం. తాజా ఎన్‌సీడీల జారీ ద్వారా వచ్చే నిధుల్లో 75 శాతం రుణాల చెల్లింపులకు, మిగిలినది సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఈ ఎన్‌సీడీలు 24, 36, 60 నెలల వ్యవధితో తీసుకొచ్చారు. త్రైమాసికానికి, ఏటా, ఏక మొత్తంలో వడ్డీ చెల్లింపు ఆప్షన్లతో తీసుకొచ్చారు. మౌలిక వసతుల కల్పనలో ప్రస్తుతం అదానీ గ్రూప్ వేగంగా విస్తరిస్తోంది. ఇటీవలే ఆ సంస్థ నిర్మించిన నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఇటీవల ప్రారంభమైంది. విశాఖలో గూగుల్‌తో కలిసి డేటా సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు దేశమంతటా పలు రోడ్డు ప్రాజెక్టులను నిర్వహిస్తోంది.

## మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ ఈవీ



విద్యుత్తుతో నడిచే స్పోర్ట్స్ వినియోగ వాహనం ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ ఈవీని మహీంద్రా అండ్ మహీంద్రా ఆవిష్కరించింది. టాటా నెక్సాన్ ఈవీ, ఎంజీ విండ్‌సర్‌కు ఇది పోటీ ఇస్తుందని భావిస్తున్నారు. 4 4.2 మీటర్ల విభాగంలో ఆవిష్కరించిన ఈ కారులో అడాస్, 360 డిగ్రీ కెమేరా, టచ్‌స్క్రీన్ సిస్టమ్స్, నెట్‌తో అనుసంధానం, పనోరమిక్ సన్‌రూఫ్, డాల్బీ ఆడియో వంటి సదుపాయాలున్నాయి. ఈ కారు ప్రారంభ ధర రూ.13.89 లక్షలు (ఎక్స్‌షోరూం). ఈ కారుకు బుకింగులు ప్రారంభించామని, ఫిబ్రవరి 23 నుంచి డెలివరీలు ఇస్తామని సంస్థ తెలిపింది. 39.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ వల్ల ఒక ఛార్జింగుతో 285 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని వెల్లడించింది.

## అమెజాన్ పేలో ఎఫ్‌డీ సేవలు.. 8% వరకు వడ్డీ




ప్రముఖ ఇకామర్స్ సంస్థ అమెజాన్‌కు చెందిన ఆర్థిక సేవల విభాగం అమెజాన్ పే (Amazon pay) కొత్త సర్వీసులను ప్రారంభించింది. ప్రస్తుతం యూపీఐ, బిల్ పేమెంట్స్ వంటి సేవలందిస్తున్న అమెజాన్ పే.. కొత్తగా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, కమర్షియల్ బ్యాంకులతో జట్టు కట్టింది. అమెజాన్ పేలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడానికి ప్రత్యేకంగా సేవింగ్స్ ఖాతా తెరవాల్సిన అవసరం లేదు. అమెజాన్ పే యాప్ ద్వారానే సులువుగా అధిక వడ్డీ రేటుకు ఎఫ్‌డీ చేయొచ్చు. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్, స్లైస్, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో పాటు శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌తో అమెజాన్ పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. రూ.1000 మొదలుకొని ఎంతైనా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయొచ్చని అమెజాన్ పే తెలిపింది. వార్షికానికి 8 శాతం వరకు వడ్డీ పొందొచ్చని పేర్కొంది. మహిళా ఇన్వెస్టర్లకు శ్రీరామ్ ఫైనాన్స్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 0.5 శాతం అదనపు వడ్డీ లభిస్తుందని పేర్కొంది.

భాగస్వామ్య బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (DICGC) కింద రూ.5 లక్షల వరకు బీమా హామీ ఉంటుందని అమెజాన్ పే వెల్లడించింది. అమెజాన్ యాప్‌లోని ‘అమెజాన్ పే’ సెక్షన్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. టర్మ్స్ అండ్ కండీషన్స్‌ను పూర్తి చేశాక.. నచ్చిన ఆర్థిక సంస్థను, డిపాజిట్ కాలవ్యవధిని ఎంచుకోవచ్చు. వడ్డీ రేట్లు ఏ బ్యాంకులో ఎక్కువ ఉన్నాయో పోల్చి చూసుకోవచ్చు. ఎలాంటి పత్రాలు అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ ప్రక్రియలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయొచ్చని అమెజాన్ పే తెలిపింది

## తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు

పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..

**బంగారం గురించి..**

బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్ , బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.

నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది.

బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. తగ్గినా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడినందున డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది.

కొన్ని దుకాణాలు, ప్రాంతాల్లో పన్నులు, సుంకాలు ముందుగా కలపకుండా లోహాల ధరలను ప్రకటిస్తుంటాయి. దీనివల్ల ధర తక్కువగా కనపడుతుంది. ఆభరణం నచ్చి, బిల్లు వేయమన్నప్పుడు, పన్నులు/సుంకాలు కలిపితే.. ఏ ప్రాంతంలో అయినా బంగారానికి ఒకటే ధర అవుతుంది. ఆభరణం తయారీ, తరుగు ఛార్జీల్లో మాత్రం ప్రతి దుకాణానికీ తేడా ఉంటుంది.

కొంతమంది వ్యాపారులు బిల్లు లేకుండా విక్రయిస్తాం.. అప్పుడు 3 శాతం జీఎస్‌టీ కట్టాల్సిన అవసరం ఉండదని చెబుతుంటారు. అయితే బిల్లు లేకుండా కొంటే కొన్ని చిక్కులు ఎదుర్కోవాలి. బంగారం నాణ్యత సరిగా లేకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ఆభరణం మరమ్మతులకూ బాధ్యత వహించరు. కాబట్టి బంగారం కొనేటప్పుడు బిల్లు ముఖ్యం.



## అనసూయ హీరోయిన్ ఎప్పుడైంది?' ట్రోలర్స్‌కు తనదైన జవాబిచ్చిన రంగమ్మత్త

వివాదాలతో యుద్ధం.. సమాధానాలతో సావాసం.. అన్నట్లు ఉంది నటి, వ్యాఖ్యాత అనసూయ (Anasuya Bharadwaj) పరిస్థితి. హీరోయిన్ దుస్తులపై మొదలైన రగడ మలుపులు మీద మలుపులు తీసుకుంటోంది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చే క్రమంలో తాను కూడా హీరోయిన్‌గా చేశానంటూ అనసూయ బదులిచ్చారు. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా ఆమెను ఎంతో మంది ట్రోల్ చేయడం మొదలు పెట్టారు. 'అనసూయ హీరోయిన్ కాదు కదా', 'అనసూయ హీరోయిన్ ఎప్పుడయ్యారు?' అంటూ ఆమెను కోట్ చేస్తూ పోస్టులు పెట్టడం మొదలు పెట్టారు. దీంతో తాజాగా ఆమె స్పందించారు.

"హీరోయిన్ తెరపై కాదు.. సత్యం మాట్లాడే ధైర్యం.. సొంత దారిలో నడిచే శక్తి.. సరైన దానికి నిలబడే గుండె.. ఈ లక్షణాలున్నవారే రియల్ హీరోయిన్. మిగతా వాళ్లు కేవలం నటులు మాత్రమే" అంటూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అంతేకాదు, హీరోయిన్ అనే పదాన్ని గూగుల్ సెర్చ్ చేసి, డిక్షనరీ చూపించిన అర్థాన్ని కూడా పోస్ట్ చేశారు. 'అందరూ చేస్తున్నారు కదాని తప్పు ఎప్పుడూ ఒప్పు అయిపోదు.. అలాగే సరైన దానిని ఎవరూ పాటించకపోతే, అది ఒప్పు కాకుండా పోదు' అని మరో పోస్ట్ పెట్టారు.

'ఛత్రపతి'లో ఇంటర్వెల్ సీన్.. అసలు నిజం చెప్పిన ప్రభాస్!

మరోవైపు నటి రాశి (Raasi)కి ఆమె క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. కొన్నాళ్ల క్రితం ఓ కార్యక్రమంలో అనసూయ తనను కించపరిచేలా మాట్లాడారంటూ రాశి మండిపడ్డారు. ఈ క్రమంలోనే అనసూయ రియాక్ట్ అవుతూ.. ఓ నోట్ విడుదల చేసి క్షమాపణ చెప్పారు. అప్పుడున్న పరిస్థితుల్లో దానిని నిలదీసే శక్తి తనకు లేదన్నారు. ఆ తర్వాత తనలో మార్పు మొదలైందని తెలిపారు. తన తప్పును అంగీకరిస్తున్నానని అందుకు క్షమించాలని కోరారు.



# 'టాక్సిక్'లో మరో హీరోయిన్.. ఫస్ట్ లుక్ రిలీజ్



యశ్ (Yash) హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' (Toxic) చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ (Rukmini Vasanth) ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు.

ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు.

నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ (Huma Qureshi) ఎలిజబెత్‌గా, నయనతార (Nayanthara) గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## అందరూ మెచ్చేలా ది రాజాసాబ్



'ప్రభాస్ 'బాహుబలి'కి ముందు ఎలా కనిపించేవారో 'ది రాజాసాబ్' చిత్రంలో అలా కనిపిస్తార''న్నారు నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. ఈ సినిమాలోని కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఫాంటసీ అంశాలు అందర్నీ అలరిస్తాయని తెలిపారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని ''నాచే నాచే..'' గీతాన్ని సోమవారం ముంబయిలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రం రొమాంటిక్ హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందింది. ఇది భారతీయ సినిమాకి కొత్త జానర్'' అన్నారు. సీనియర్ నటి జరీనా వహాబ్ మాట్లాడుతూ.. ''హిందీలో కుటుంబ కథలు పూర్తిగా కనుమరుగైపోయాయి. కానీ దక్షిణాదిలో అలాంటి కథలు బాగా వస్తున్నాయి. ఈ సినిమా ప్రభాస్‌ది అని చెప్పగానే నటించడానికి ఓకే చెప్పేశాను''అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. ''మా చిత్రం కోసం భారతీయ చిత్రసీమలో ఎప్పుడూ చేయనంత పెద్ద ఇండోర్ సెట్ వేశాం. వీఎఫ్ఎక్స్ కూడా చాలా గొప్పగా ఉంటాయి'' అన్నారు. ''పిల్లలకీ.. పెద్దలకీ నచ్చే చిత్రమిది. దీంట్లో ప్రభాస్‌తో కలిసి నటించడం మర్చిపోలేన'న్నారు నటి

## 'ప్రేమలు' తర్వాత...!



దక్షిణాదిలో అగ్రతారల సరసన వరుస అవకాశాలతో జోరుమీదుందీ మలయాళ నటి మమితా బైజు. ఇటు యువకథానాయకులతోనూ రొమాంటిక్ కామెడీ చిత్రాలను చేస్తూ.. కుర్రకారు మనసుల్ని దోచుకుంటుందీ భామ. తను నటించిన 'ప్రేమలు' చిత్ర దర్శకుడు గిరీష్ ఏడీతో కలిసి మరోసారి పనిచేయనుంది మమిత. 'బెత్లెహెం కుడుంబ యూనిట్' పేరుతో వస్తోన్న ఈ చిత్రంలో నివిన్ పౌలీ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభించినట్లు తెలిపింది చిత్రబృందం. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఇన్‌స్టాలో ఓ వీడియోను పంచుకుంది.

''భావన స్టూడియోస్ నివిన్, మమితా ప్రధాన పాత్రల్లో రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని రూపొందిస్తుంది. నూతన సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభిస్తూ.. ఈ సినిమా చిత్రీకరణను మొదలుపెట్టాము''ని వ్యాఖ్యల్ని జోడించింది. ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ, శ్యామ్ మోహన్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం మమిత నటుడు సూర్య, విజయ్ దళపతి సహా పలువురు యువ హీరోల చిత్రాలలో నటిస్తోంది. ఇటీవలే విడుదలైన 'సర్వంమాయ' చిత్రంతో నివిన్ ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తున్నాడు. ఆయన తదుపరి 'బెంజ్' చిత్రంలో విలన్‌గా కనిపించనున్నాడు.



## జోరుగా మెగా 158 సన్నాహాలు

ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు చిరంజీవి. అయితే ఈ చిత్ర హడావుడి పూర్తయిన వెంటనే చిరు తదుపరి సినిమాని పట్టాలెక్కించేందుకు తెర వెనుక సన్నాహాలు మొదలైపోయాయి. 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత ఈ ఇద్దరి కాంబో నుంచి రానున్న కొత్త సినిమా ఇది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలతో మొదలు కానుందని సమాచారం. చిరంజీవి మార్చి నుంచి సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారని తెలిసింది. ఇది పూర్తిగా యాక్షన్ ప్రాధాన్యమున్న కథతో ముస్తాబు కానుందని.. చిరు మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. దీంట్లో ఆయనతో పాటు మరో స్టార్ కూడా తెర పంచుకునే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' ప్రీ రిలీజ్ వేడుకని ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చిత్రవర్గాలు సోమవారం ప్రకటించాయి.

## ప్రభాస్ 'ది రాజాసాబ్' రన్‌టైమ్ ఇదే..

# స్పెషల్ ప్రీమియర్స్‌కు ఏర్పాట్లు..!

మూడు గంటల రన్‌టైమ్. ప్రస్తుతం పాన్ ఇండియా కథలన్నీ కాస్త అటూ ఇటూగా ఇదే నిడివితో వస్తున్నాయి. ఈ విషయంలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ (Prabhas) ఓ అడుగు ముందున్నారు. 'బాహుబలి' తర్వాత ఆయన చేసిన సినిమాలన్నీ ఇలాగే అలరించాయి. ఇప్పుడు మారుతి దర్శకత్వంలో ఆయన నటించిన హారర్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్' (The RajaSaab) కూడా అదే బాటలో పయనిస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న (The Rajasaab Movie Release date) ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ మూవీ రన్‌టైమ్ బయటకు వచ్చింది. 3 గంటలా 9 నిమిషాలతో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలో 'ది రాజాసాబ్' అలరించనుంది. సినిమాలో తల నరికే సన్నివేశానికి మాత్రం సెన్సార్ కట్ చెప్పింది.

**స్పెషల్ ప్రీమియర్‌స్‌కు ఏర్పాట్లు..**

జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుండగా, ఒకరోజు ముందుగానే అంటే జనవరి 8న రాత్రి స్పెషల్ ప్రీమియర్‌లను ఏర్పాటు చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు దరఖాస్తు చేసుకుంది. తెలంగాణలో ఉదయం 4గంటల షోకు కూడా అనుమతి ఇవ్వాలని కోరింది. స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను సింగిల్ స్క్రీన్‌లో రూ.800 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లలో రూ.1000 (పన్నులతో కలిపి) పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. జనవరి 9న నుంచి 11 వరకూ సింగిల్ స్క్రీన్‌లో రూ.105 (పన్నులతో కలిపి).. 12 నుంచి 18వ తేదీ వరకూ రూ.62 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లో వరుస తేదీల్లో రూ.132, రూ.89 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. త్వరలోనే దీనిపై సినిమాటోగ్రఫీశాఖ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రకటన రాగానే బుకింగ్స్ ఓపెన్ అయ్యే అవకాశం ఉంది.ప్రభాస్ సరసన ముగ్గురు కథానాయికలు మాళవిక మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ నటిస్తుండగా, సంజయ్‌దత్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందించిన పాటలు ఇప్పటికే యువతను ఆకట్టుకుంటున్నాయి.



## వారణాసి' గ్లింప్స్.. అక్కడ ఫస్ట్ ఇండియన్ సినిమాగా రికార్డు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు (Mahesh babu) హీరోగా రానున్న చిత్రం 'వారణాసి' (Varanasi). ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం తాజాగా సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది.జనవరి 5న ఈ సినిమా టైటిల్ టీజర్‌ను పారిస్‌లోని లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఈ విషయం తెలుపుతూ లే గ్రాండ్ రెక్స్ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీంతో అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఇది ఇండియన్ సినిమాకు గొప్ప గుర్తింపు అని అభిమానులు భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఈ థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే భారీ స్థాయిలో గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం.యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'వారణాసి' సిద్ధమవుతోంది. ఇందులో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆయన ప్రాచీన భారత యుద్ధకళ కలరిపయట్టు (Kalarippayattu) నేర్చుకున్నారు. ఇందులో కొన్ని సన్నివేశాల్లో ఆయన రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా (Priyanka Chopra), కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు.

**విడుదల తేదీ వైరల్..**

ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం 2027 ఏప్రిల్ 9న విడుదల కానున్నట్లు రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



## మరో భారీ రికార్డుకు 25 పరుగుల దూరంలో కోహ్లీ




భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో భారీ రికార్డును తన ఖాతాలో వేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అతను మరో 25 పరుగులు చేస్తే సచిన్‌ను అధిగమించి అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా 28,000 రన్స్ చేసిన ప్లేయర్‌గా నిలుస్తాడు. విరాట్ ఇప్పటివరకు మూడు ఫార్మాట్లలో కలిపి 623 ఇన్నింగ్స్‌ల్లో 27,975 పరుగులు చేశాడు. ఇందులో 84 సెంచరీలు, 145 అర్ధ శతకాలున్నాయి. సచిన్ తెందూల్కర్ ఈ ఫీట్‌ను 644 ఇన్నింగ్స్‌ల్లో అందుకోగా.. శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార్ సంగక్కర 666 ఇన్నింగ్స్‌ల్లో సాధించాడు.

--రోహిత్ మరో 87 రన్స్ చేస్తే.. కివీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ శర్మ కూడా ఆడనున్నాడు. హిట్‌మ్యాన్ మరో 87 పరుగులు చేస్తే లిస్ట్‌ఎ క్రికెట్‌లో 14,000 పరుగులు పూర్తి చేసుకున్న ఐదో భారత బ్యాటర్‌గా నిలుస్తాడు. సచిన్ తెందూల్కర్, సౌరభ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, కోహ్లీ ఇప్పటికే ఈ ఘనతను సాధించారు. రోహిత్ ఇప్పటివరకు లిస్ట్‌ఎ క్రికెట్‌లో 352 మ్యాచ్‌లు ఆడి 13,913 పరుగులు చేశాడు. ఇక ప్రస్తుతం అతని ఫామ్ విషయానికొస్తే.. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో సిక్కింపై 155 పరుగులు చేసి ముంబయి విజయంలో కీలకపాత్ర పోషించాడు. తర్వాత ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో డకౌటయ్యాడు. విజయ్ హజారేలో కోహ్లీ ఆంధ్రపై సెంచరీ (131), గుజరాత్‌పై 77 పరుగులు చేశాడు.

# ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యం



**తొలి ఇన్నింగ్స్‌లో 518/7**
**హెడ్, స్మిత్ సెంచరీలు**
**'యాషెస్' సిరీస్ చివరి టెస్టు**

సిడ్నీ: సొంతగడ్డపై జరుగుతున్న 'యాషెస్' సిరీస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు విజృంభిస్తున్నారు. ఫలితంగా ఆఖరిదైన ఐదో టెస్టులో ఆసీస్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3-1తో చేజిక్కించుకున్న కంగరూలు ఆఖరి పోరులో పరుగుల వరద పారిస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 166/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు... మంగళవారం ఆట ముగిసే సమయానికి 124 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 518 పరుగులు చేసింది.ఓపెనర్ ట్రవిస్ హెడ్ (166 బంతుల్లో 163; 24 ఫోర్లు; 1 సిక్స్), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (205 బంతుల్లో 129 బ్యాటింగ్; 15 ఫోర్లు, 1 సిక్స్) శతకాలతో కదం తొక్కారు. కామెరాన్ గ్రీన్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), బ్యూ వెబ్‌స్టర్ (58 బంతుల్లో 42 బ్యాటింగ్; 4 ఫోర్లు) కూడా రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్ 3, స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో 3 వికెట్లు ఉన్న ఆసీస్ జట్టు... ఇంగ్లండ్ కంటే 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. స్మిత్‌తో పాటు వెబ్‌స్టర్ క్రీజులో ఉన్నాడు.

**స్మిత్ సూపర్ సెంచరీ...**

శతకానికి 9 పరుగుల దూరంలో మంగళవారం ఇన్నింగ్స్ కొనసాగించిన హెడ్... 105 బంతుల్లో మూడంకెల మార్క్ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో హెడ్‌కిది మూడో సెంచరీ కావడం విశేషం. నైట్ వాచ్‌మన్ నెసెర్ (90 బంతుల్లో 24; 4 ఫోర్లు) అతడికి చక్కటి సహకారం అందించడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. మూడో వికెట్‌కు నెసెర్‌తో కలిసి హెడ్ 72 పరుగులు జోడించాడు. అతడు అవుటయ్యాక స్మిత్‌తోనూ అదే లయ కొనసాగించాడు. నాలుగో వికెట్‌కు 54 పరుగులు జోడించిన అనంతరం హెడ్ అవుట్ కాగా... కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఉస్మాన్ ఖ్వాజా (49 బంతుల్లో 17; 2 ఫోర్లు) పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అలెక్స్ కేరీ (16) విఫలమయ్యాడు.

అయితే చివర్లో గ్రీన్, వెబ్‌స్టర్ అండతో స్మిత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు పెద్దగా రాణించలేకపోయిన స్మిత్... చివరి మ్యాచ్‌లో తనదైన ఆటతీరుతో చెలరేగాడు. ఈ క్రమంలో 166 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యాషెస్‌లో అతడికిది 13వ సెంచరీ కాగా... సిడ్నీ మైదానంలో ఐదోది. ఈ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లకు అర్ధ శతక భాగస్వామ్యాలు నమోదు చేసింది. 'భాగస్వామ్యాలు బాగా కుదిరాయి. అందుకే సాఫీగా పరుగులు రాబట్టగలిగాం. తొలి ఇన్నింగ్స్‌లో రెండొందల పరుగుల ఆధిక్యం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వికెట్ నెమ్మదిగా మారుతోంది. ఇది నా సొంత మైదానం. ఇక్కడ బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా' అని స్మిత్ అన్నాడు.

■ 13 'యాషెస్'లో స్టీవ్ స్మిత్ సెంచరీల సంఖ్య. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగే ఈ సిరీస్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో జాక్ హబ్స్ (12)ను అధిగమించి స్మిత్ రెండో స్థానానికి చేరాడు. డాన్ బ్రాడ్‌మన్ 19 శతకాలతో 'టాప్'లో ఉన్నాడు.

■ 37 టెస్టు క్రికెట్‌లో స్మిత్ సెంచరీల సంఖ్య. అత్యధిక శతకాలు చేసిన ప్లేయర్ల జాబితాలో రాహుల్ ద్రవిడ్ (36)ను అధిగమించి ఆరో స్థానానికి ఎగబాకాడు. సచిన్ టెండూల్కర్ (51), జాక్వస్ కలిస్ (45), రికీ పాంటింగ్ (41), జో రూట్ (41), కుమార సంగక్కర (38) ముందున్నారు.

■ 3682 'యాషెస్'లో స్మిత్ చేసిన పరుగులు. బ్రాడ్‌మన్ (5028) అగ్ర స్థానంలో ఉండగా... స్మిత్ రెండో స్థానానికి చేరాడు.

■ 18 సారథిగా స్మిత్ సాధించిన శతకాలు. ఈ జాబితాలో గ్రేమ్ స్మిత్ (25), విరాట్ కోహ్లి (20), రికీ



## ఆయుష్ సంచలనం

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జియా (మలేసియా)కు షాకిచ్చి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఆయుష్ 21-12, 21-17తో లీ జియాపై విజయం సాధించాడు. స్టార్ షట్లర్ లక్ష్యసేన్ కూడా ముందంజ వేశాడు. తొలి రౌండ్లో అతడు 21-16, 15-21, 21-14తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మాళవిక బాన్సోద్ 11-21, 11-21తో ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయంపాలైంది.

## టీమ్ఇండియా కోచ్‌గా ఉండటం అంత ఈజీ కాదు: హర్భజన్ సింగ్

టీమ్ఇండియాకు ప్రస్తుతం మూడు ఫార్మాట్లలో గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. గౌతీ మార్గదర్శకత్వంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత జట్టు మెరుగైన ఫలితాలే సాధించింది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేసింది. న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతిలో స్వదేశంలోనే వైట్‌వాష్‌కు గురైంది. ఈ క్రమంలో టెస్టులు, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు వేర్వేరుగా కోచ్‌లను నియమించాలనే చర్చ జరుగుతోంది. ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్ ఇప్పటికే ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ (Harbhajan Singh) కూడా ఈ ఆలోచనను సమర్థించాడు.'టీమ్ఇండియా (Team India) కోచ్‌గా ఉండటం అంత సులభం కాదు. కోచ్‌గా ఉండాలంటే మీరు జట్టుతో ఏడాది పాటు ప్రయాణించాలి. వేర్వేరు ఫార్మాట్లకు జట్లను ఎంపిక చేయాల్సి ఉన్నందున ఎల్లప్పుడూ ఆటగాళ్ల ప్రదర్శనను గమనిస్తూ ఉండాలి. మ్యాచ్ ఫలితాలపై కూడా దృష్టి పెట్టాలి. గౌతమ్ గంభీర్ (Gautam Gambhir) మైదానంలోకి వెళ్లి ఆడడు. ఎప్పుడు ఎలా ఆడాలో మాత్రమే చెప్తాడు. క్రికెటర్‌గా కొనసాగినప్పుడు అతను బాగా ఆడాడు. భారత్ తరఫున అద్భుతమైన ప్రదర్శనలు చేశాడు. ప్రతి ఒక్కరూ ఓపిక పట్టాలి. వైట్‌బాల్ క్రికెట్, టెస్టులకు ఇప్పుడు వేర్వేరుగా కోచ్‌లు అవసరం లేదు. కాలక్రమేణా అవసరమైతే ఈ విధానాన్ని అనుసరించవచ్చు.



## జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్'తో నీరజ్ చోప్రా కటీఫ్



భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా సుదీర్ఘ కాలంగా 'జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్'తో కొనసాగిన అనుబంధాన్ని ముగించాడు. 2016 నుంచి జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కంపెనీ నీరజ్ చోప్రా మేనేజ్‌మెంట్ వ్యవహారాలు చూస్తూ వచ్చింది. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆరంభంలో జత కట్టిన అథ్లెట్లలో నీరజ్ ఒకడు. ఈ సంస్థతో విడిపోతూ నీరజ్ తన సొంత అథ్లెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'వెల్ స్పోర్ట్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. అటు నీరజ్, ఇటు జేఎస్‌డబ్ల్యూ కూడా ఎలాంటి వివాదం లేకుండా పరస్పర ఒప్పందంతోనే ఈ బంధానికి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాయి. 'గత పదేళ్లుగా నా అద్భుత ప్రయాణం, ఎదుగుదలలో జేఎస్‌డబ్ల్యూ కీలక పాత్ర పోషించింది. వారు అందించిన సహకారానికి ఎప్పటికీ కృతజ్ఞుడను' అని నీరజ్ వ్యాఖ్యానించాడు. 'నీరజ్‌తో కలిసి పని చేయడం గొప్ప గౌరవం. ఆటకు సరైన సహకారం అందిస్తే అద్భుతాలు జరుగుతాయనే మా నమ్మకానికి అతడి విజయాలు సరైన ఉదాహరణ' అని జేఎస్‌డబ్ల్యూ సీఈఓ దివ్యాంశు సింగ్ అన్నారు. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన నీరజ్ చోప్రా...2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు.



## కొత్త సీజన్‌లో కోటి ఆశలతో...

**భారత షట్లర్లు సై**
**నేటి నుంచి మలేసియా ఓపెన్ సూపర్–1 000 టోర్నీ**

కౌలాలంపూర్: కొత్త ఏడాది కొత్త సీజన్‌ను ఘనంగా ఆరంభించాలని భారత షట్లర్లంతా మలేసియా ఓపెన్‌కు సై అంటున్నారు. అనుభవజ్ఞులైన స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ సహా భారత బలగమంతా ఈ టోర్నీ బరిలోకి దిగుతోంది. 14,50,000 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 13.09 కోట్లు) గల ఈ సూపర్-1000 టోర్నమెంట్‌ను ఆశావహ దృక్పథంతో ప్రారంభించాలని భారత షట్లర్లు భావిస్తున్నారు.

2025 సీజన్ భారత బ్యాడ్మింటన్‌కు ఓ చేదుగుళికగా ముగిసింది. స్టార్ ఆటగాళ్ల గాయాలు, నిలకడలేని ఆటతీరు, ప్రధాన టోర్నీలో చెత్త ప్రదర్శన ఇలా చెప్పుకుంటూ పోతే నిరుత్సాహకరంగానే గతేడాది ముగిసింది. దీనిని సాధ్యమైనంత తొందరగా మర్చిపోయి మలేసియా ఓపెన్‌లో మంచి రోజులను తెచ్చుకోవాలని... తద్వారా వచ్చే వారం సొంతగడ్డ (ఢిల్లీ)పై జరిగే ఇండియా ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాలని షట్లర్లంతా ఆశిస్తున్నారు.

జియా హెంగ్‌తో లక్ష్య పోరు

సింగిల్స్‌లో లక్ష్యసేన్ గుడ్డికంటే మెల్ల నయం అన్నచందంగా ఒకటి అర టోర్నీలో మెరిశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 టోర్నీలో టైటిల్ గెలిచాడు. హాంకాంగ్ ఓపెన్ ఫైనల్ చేరాడు. ఇప్పుడు తాజా టోర్నీ సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాసన్‌తో 24 ఏళ్ల స్టార్ షట్లర్ ఈ సీజన్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. యూఎస్ ఓపెన్ సూపర్-300 టైటిల్ గెలిచిన యువతార ఆయుశ్ షెట్టి ఈ సీజన్‌లో ప్రతీ టోర్నీలోనూ నిలకడైన ప్రదర్శన కనబరచడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. తొలి మ్యాచ్‌లో ఇతనికి క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురవుతున్నాడు. తొలి రౌండ్లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జి జియా (మలేసియా)తో ఆయుశ్ పోటీపడతాడు.

గంపెడాశలతో సింధు

మహిళల సింగిల్స్‌లో రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు ఈ సీజన్‌పై గంపెడాశలు పెట్టుకుంది. గాయాల బెడదతోనే గడిచిన గత సీజన్‌ను మరిపించేలా ఈ ఏడాది తన ప్రదర్శన ఉండాలని గట్టి పట్టుదలతో ఉంది. తొలి పోరులో భారత స్టార్ షట్లర్ సింధు... చైనీస్ తైపీకి చెందిన సంగ్ షువో యున్‌తో తలపడుతుంది. అయితే ఉన్నతి హుడాకు తొలి రౌండ్లో చైనా గోడ ఎదురవుతోంది. ఆమె టోక్యో ఒలింపిక్స్ చాంపియన్, నాలుగో సీడ్ చెన్ యు ఫె (చైనా)ను ఢీకొట్టనుంది. మోకాలి గాయంతో ఆరు నెలలు పూర్తిగా ఆటకు దూరంగా ఉన్న మాళవిక బన్సోద్... మాజీ ప్రపంచ చాంపియన్, ఏడో సీడ్ రచనొక్ ఇంతనొన్ (థాయ్‌లాండ్)తో సీజన్‌ను ప్రారంభించనుంది.

సాత్విక్-చిరాగ్‌ల జోరు కొనసాగేనా...

గత ఏడాది ఓవరాల్‌గా భారత బ్యాడ్మింటన్‌లోనే అత్యంత మెరుగ్గా, ధీటుగా రాణించిన ఆటగాళ్లెవరైనా ఉంటే సాత్విక్-చిరాగ్‌లే! పెద్దగా కలిసిరాని 2025లో కూడా తమ ఉనికి చాటుకొని జోరు సాగించిన జోడీ... ఇప్పుడు ఇదే ఉత్సాహంతో 2026ను ఘనంగా మొదలుపెట్టాలని అనుకుంటుంది. గత నెల ముగిసిన వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సెమీస్ దాకా పోరాడిన సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ... హాంకాంగ్ ఓపెన్, చైనా మాస్టర్స్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరెన్నో టోర్నీలో సెమీస్ చేరింది. తాజా టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం... లీ జె హుయ్-యంగ్ పొ సున్ (చైనీస్ తైపీ) జంటతో తొలి రౌండ్‌లో తలపడుతుంది. మరో డబుల్స్ జోడీ ఎమ్.ఆర్. అర్జున్-హరిహరన్.... హిరొకి మిడొరికవా-క్యోహి యమషిత (జపాన్) జంటతో పోటీపడుతుంది.

కొత్త ఉత్సాహంతో గాయత్రి-ట్రెసా

మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రెసా జాలీ జోడీ నూతనోత్సాహంతో మలేసియా టోర్నీలో దిగుతోంది. గత ఏడాది గాయత్రి భుజం గాయంతో ఇబ్బంది పడింది. ఇటీవల ట్రెసాతో కలిసి సయ్యద్ మోడి టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవడం ద్వారా రేసులోకి వచ్చారు. ఈ టోర్నీ తొలి రౌండ్లో గాయత్రి-ట్రెసా జోడీ ఇండోనేసియాకు చెందిన ఫెబ్రియానా ద్విపుజి కుసుమ-మెలిసా ట్రియాస్ పుస్పిటసరి జంటతో తలపడనుంది.